# సూర్య

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా

కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం,9 మార్చి 2024








## కోనపపేటలో ఉద్ధృతి

**- పైపులైన్ తొలగించాలని రోడ్డుపై బైఠాయింపు**

**- బోటికి నిప్పు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నం**

**యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ :** కోనపపేట గ్రామం సముద్రంలో వేసిన అరబిందో పైప్ లైన్ తీయాలంటూ గత మూడు రోజుల నుంచి ధర్నా చేస్తున్న మత్స్యకారులును అధికారులు పట్టించుకోవటం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. ధర్నా చేపట్టి శుక్రవారానికి మూడు రోజులు గడుస్తున్నప్పటికీ అధికారులు, రాజకీయ నాయకులు స్పందన లేకపోవడంతో తమ బోట్లుకి తామే నిప్పంటించుకొని నిరసన తెలుపుతున్నారు.అరబిందో పైప్ లైన్ తీయకపోతే మత్స్య సంపద కనుమరుగవుతుందంటూ మత్స్యకారుల ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆందోళన చేపట్టారు. గతంలో ధర్నాలు చేపడితే అధికారులు హామీ ఇచ్చి ఇప్పటికీ పైపులైన్లు తీయించలేదని తెలిపారు. మహిళ మత్స్యకారులు ఒంటి పైకి పెట్రోల్ పోసుకొని ఆందోళన చేపట్టడంతో తీవ్ర ఉద్ధృత పరిస్థితులు నెలకొన్నాయి. ఏక్షణంలో ఏంజరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని స్థానికులు తెలుపుతున్నారు. బాధిత మత్స్యకారులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్కును మళ్లించారు.

# మహా వైభవంగా మహాశివరాత్రి









**- సామర్లకోట, పీఠాపురంలో చేతులెత్తేసిన అధికారులు**

**- ఈ రెండు ఆలయాలలో కనీస వసతులు కరువు**

**- బండబూతులు తిట్టిన భక్తులు**

**కాకినాడ,మేజర్న్యూస్ప్రతినిధి:** సృష్టి,స్థితి,లయకారుకుడైన పరమేశ్వరుడు భోళాశంకరుడు. ఆయనకు అత్యంత విశేషమైన రోజుగా, ప్రీతిపాత్రమైనదిగా చెప్పబడేది మహాశివరాత్రి పర్వదినం. శివ అంటే శివుడు, రాత్రి అంటే పార్వతి శివరాత్రి అంటే పార్వతీ పరమేశ్వరులు అని అర్ధం. కోరిన వరాలిచ్చే భక్తవల్లభుడు, భక్తాగ్రేసరుడు అయిన ముక్కంటి కొలువుదీరిన మహా శివరాత్రి రోజున శివాలయాన్ని సందర్శించినా శివనామస్మరణం చేసినా సర్వపాపాలు తొలగిపోయి ఐశ్వర్యం సిద్ధిస్తుందంటారు. శుక్రవారం మహా శివరాత్రి కావడంతో వేలు, లక్షలుగా భక్తులు తరలివచ్చారు. మహాశివరాత్రి చాంద్రమాన నెల లెక్కింపు ప్రకారం మాఘమాసం కృష్ణ పక్ష చతుర్ధశి రోజున నిర్వహించుకునే పండుగ. కానీ రాత్రి 8 తరువాత చతుర్ధశి వచ్చింది. అందుకే ఈరోజే మహాశివరాత్రి నిర్వహించారు. శివపార్వతుల వివాహం జరిగిన మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం శైవ క్షేత్రాలు భక్తజనసంద్రమయ్యాయి. ఏదారి చూసినా శివాలయాలకే దారి తీసాయి. పంచారామ క్షేత్రాలకే మళ్ళాయి.

భక్తులు లక్షలాదిగా తరలివచ్చిన సామర్లకోట, పిఠాపురం ఆలయాలలో దేవాదాయశాఖ చేతులెత్తేసింది. కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. దర్శనం కోసం గంటలు తరబడి వేచి ఉన్నారు. అధికారులు లేరు. పోలీసులు బయటకి నెట్టివేశారు. దేవాదాయ శాఖ వైఫల్యం ఈ రెండు ఆలయాలలో కొట్టొచ్చినట్టు కనబడింది. సామర్లకోట ఆలయంలో ఈవో నీలకంఠం, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ భవాని కనపడే లేదని వీఐపీలు సైతం కన్నీరు పెట్టుకున్నారు. తమను అవమానించారని ఆరోపించారు. కళ్యాణం రోజునే అక్కడ ఈవో కనపడకపోవడంతో వివాదం జరిగింది. అయినా జాయింట్ కమిషనర్ దీనిపై దృష్టి సారించలేదు. జాయింట్ కమిషనర్కు ఈవో నీలకంఠానికి స్నేహ సంబంధాలు ఉండడంతో ఆయన ఈవోను ఏమీ అనలేని పరిస్థితని అక్కడ పనిచేసిన సిబ్బంది తెలిపారు. ఇక పిఠాపురంలో అయితే భక్తులు నరకం చూసారు. 364 రోజులు ఆలయానికి వెళ్ళకపోయినా మహాశివరాత్రి రోజు పరమ శివుడిని మనసారా, కంటి నిండా దర్శిస్తే పాపాలు పోతాయని పాదగయ క్షేత్రం కావడంతో ఇక్కడికి తరలివచ్చారు. కానీ తమకు శాపం వల్లే ఇక్కడికి వచ్చామని, దర్శనం కూడా కాలేదని భక్తులు వాపోయారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామమోహనరావు తన శక్తి కొద్ది పనిచేశారు. అయితే ఈవోకు ఫెస్టివల్ కమిటీకి మధ్య వివాదాలు రావడం, ఇక్కడ అర్చకునిగా పనిచేస్తున్న చంద్రమౌళి తన మనుషులను ప్రత్యేకంగా తీసుకెళ్లి దర్శనాలు చేయించడం వంటి సంఘటనలతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్చకులు తమ మనుషులను తీసుకువెళ్లి దర్శనాలు చేయించుకుంటు న్నారు. ఉదయం నుంచి లైన్లో నిలబడ్డ తమ పరిస్థితి ఏమిటని కన్నీరు పెట్టుకున్నారు. పోలీసులు ఎవరికి వారే వారి అనుచరులను లోనికి తీసుకెళ్లి దర్శనాలు చేయించుకున్నారు. ఈవో మాత్రం ఎక్కడా కనబడలేదు. దీంతో భక్తులు శాపనార్ధాలు పెట్టారు. మహాశివరాత్రి రోజు శివుడి దర్శనం కాకుండా చేశారని ఈ రెండు చోట్ల భక్తులు మనస్తాపానికి గురయ్యారు.మహా శివరాత్రి రోజున కాలువ, గోదావరి, సముద్ర స్నానం చేస్తే మంచిదని చెబుతారు. కానీ శుక్రవారం కావడంతో సముద్ర స్నానానికి వెళ్లే భక్తుల సంఖ్య తగ్గింది. మహాశివరాత్రికి లక్షలాది భక్తులు పరమశివుని సందర్శించి అభిషేకాలు జరిపించారు. పంచారామ క్షేత్రాలైన సామర్లకోట, ద్రాక్షారామంలలో కుమారరామ భీమేశ్వర ఆలయాలతో పాటు పాదగయా క్షేత్రంగా, శక్తిపీఠంగా విరాజిల్లుతున్న పిఠాపురంలోని శ్రీకుక్కుటేశ్వరస్వామివారి ఆలయంలో వేలాదిమంది భక్తులు భక్తిశ్రద్ధల మధ్య పరమేశ్వరుడుని కొలిచారు. ఇక జిల్లావ్యాప్తంగా ఉన్న 300కు పైగా శివాలయాలు మహాశివరాత్రి పూజలతోవిరాజిల్లాయి. తూరంగిలోని తూరంగేశ్వరుడు, చొల్లంగిలోని రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వరుడు ఆలయాల్లో పూజల కోసం భక్తులు పోటీ పడ్డారు. తూరంగి, సంపర, ముక్తేశ్వరం లలో స్వయంగా ఈఓ లు చిట్టావజ్జల నాగ శ్రీనివాస సుబ్రహ్మణ్యం, చీమలకొండ వెంకటరమణమూర్తిలు అర్చకులుగా మారి రుద్ర నమక చమకాలతో మహాభిషేకాలు నిర్వహించారు. అలాగే అత్యంత పురాతన, ప్రాశస్త్యమైన జిల్లాలోని కోరంగి, కుండాలేశ్వరం, కడలి, గుడిమూల, శివకోటి కోటిపల్లి, మండపేట, మందపల్లి, ఇంద్రపాలెం ఆలయాలు మహాశివరాత్రి పూజలతో మార్మోగిపోయాయి. ఓం నమశ్శివాయ, పార్వతీ పతియే నమోమహః అంటూ భక్తులు శివనామస్మరణలు చేసి పులకించిపోయారు. ఆయా ఆలయ ఈవోలు వడ్డాది సత్తిబాబు, టి. సూర్యనారాయణ, ఎం.మురళి వీరభద్రరావు, ఎం.శ్రీదేవి, వరిపల్లి శ్రీనివాసరావు, ఆర్.రాజేశ్వరరావు, మాచిరాజు లక్ష్మీనారాయణ, తారకేశ్వరరావు, శివబాబు, డి.శ్రీనివాసరావు, సి.హెచ్. విజయ భాస్కర్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు వడ్డి ఫణీంద్ర కుమార్, బాబు, బాలాజీ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ద్రాక్షారామ ఆలయానికి జాయింట్ కమిషనర్ విజయరాజు చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ గా వ్యవహరించారు.

## శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు



**ఆత్రేయపురం,మేజర్న్యూస్ :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాలు అన్ని భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి ఆత్రేయపురం బాలా త్రిపురసుందరి సమేత రాజరాజేశ్వరస్వామి, వసంతవాడ పార్వతీ పరమేశ్వరస్వామి, ర్యాలీ ఉమాకమండలేశ్వరస్వామి, వాడపల్లి కాశి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, కట్టుగ పార్వతి సమేత శకిలేశ్వర స్వామి ఆలయం తదితర ఆలయాల్లో స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాడపల్లి కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారిని రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్ ఎం .సీతారామమూర్తి దంపతులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంతవాడ పార్వతిదేవి ఆలయాన్ని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు, జడ్పిటిసి బోనం సాయిబాబా, సర్పంచ్ గాదిరాజు రామకృష్ణంరాజు, వాడపల్లి దేవస్థాన పాలకమండలి సభ్యులు పెనుమత్స సురేష్ రాజు, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరు వెంకట్ రాజు, మాజీ ఎంపీటీసీ దండు రాంబాబు తదితరులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ సచివాలయం ముట్టడి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండల కేంద్రం ఆత్రేయపురంలోని చిన్నపేటలో డ్రైనేజీలు వ్యవస్థ లేక మురుగునీటితో సతమతం అవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో మురుగు సమస్యను పరిష్కరించాలంటూ శుక్రవారం గ్రామ సచివాలయాన్ని ముట్టడించారు. పంచాయతీ ఖాతాలో కోట్లాది రూపాయలు జనరల్ ఫండ్స్, 15వ ఆర్థిక సంఘం నిధులు 70 లక్షలు ఉన్న అభివృద్ధి పనులు ఎందుకు చేపట్టడం లేదంటూ నిలదీశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సర్పంచ్ గెద్దం సుధా మాట్లాడుతూ నిధులు ఉన్నప్పటికీ అధికార పార్టీ నాయకులు గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని, స్వప్రయోజనాల కోసం గ్రామ ప్రజలకు ఉపయోగపడని సిసి రోడ్లు వేసుకునేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నించగా తాను అడ్డుకోవడంతో మిగిలిన అభివృద్ధి పనులకు పంచాయతీ ఆమోదం లభించకుండా అధికార పార్టీ వార్డు మెంబర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, గ్రామ ప్రజలకు ఉపయోగపడే పనులు ఏమైనా సరే మా సహాయ సహకారాలు ఉంటాయని వివరించారు. త్వరలో చిన్న పేటలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు, తొందరలోనే మురుగు సమస్య పరిష్కారం అవుతుందని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణ, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

## టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం



**ఆత్రేయపురం,మేజర్న్యూస్ :** రాష్ట్రఅభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వానికే సాధ్యమని మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు అన్నారు. శుక్రవారం బాబు షూరిటీ సూపర్ సిక్స్ పథకాలను ఆత్రేయపురం బూత్ నెంబర్ 27 లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అందరికి వచ్చే ప్రయోజనం పార్టీ కల్పించే పథకాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో ఉండి తెలుగుదేశం ప్రభుత్వం గెలుపుకు కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలోనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మారుమ్రోగిన శైవక్షేత్రాలు



**ఆలమూరు, మేజర్ న్యూస్ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని హరహర మహాదేవ శంభో అంటూ శివనామ స్మరణతో శైవ క్షేత్రాలు మారుమ్రోగాయి. తూర్పు గోదావరి జిల్లా ఆలమూరు మండలం మడికి శ్రీ బాల త్రిపుర సుందరీదేవి సమేత శ్రీ సోమేశ్వర స్వామి, మూలస్థాన అగ్రహారంలో గల శ్రీ ఉమా మ్షలేశ్వర స్వామి, చొప్పెల్లలో శ్రీ పార్వతీ మల్లేశ్వరస్వామి వారు, ఆలమూరు శ్రీ పార్వతి విక్రమ బట్టేశ్వర స్వామి, జొన్నాడలో గల ఉమా మల్లేశ్వర స్వామి, పెనికేరు ఇష్ట కాంతేయ స్వామి, చింతలూరు ఉమా పృధ్వీశ్వర స్వామి, పెద్దపల్ల ఉమా మల్లేశ్వరస్వామి, నర్సిపూడి పార్వతి సోమేశ్వరస్వామి వారి ఆలయాల్లో తెల్లవారు జాము నుండి ఆది దంపతులకు ప్రత్యేక తైలాభిషేకాలు నిర్వహించారు. ఆయా ఆలయాల కార్యనిర్వాహక కార్యదర్శ ఎం ఎస్ ఆర్ కృష్ణ భక్తుల దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చక స్వామి కాళ్లకూరి కామేశ్వర శర్మ, అయ్యలూరి బ్రహ్మన్న ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అలాగే ఆదిదంపతుల దర్శనానికి వచ్చే భక్తులకు తీర్థ ప్రసాదాలను పలువురు భక్తులు అందజేశారు.

## 'రంప' మల్లికార్జున స్వామిని దర్శించిన భక్తజనం

**- వేలాది మంది పుణ్య స్నానాలు**

**- శివనామ స్మరణతో భక్తులు పూజలు**






**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మహాశివరాత్రి సందర్భంగా రంప గ్రామంలోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో శుక్రవారం దర్శించుకున్నారు. రంప కొండపై జలపాతం వద్ద భక్తులు తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో స్నానమాచరించి శివనామస్మరణతో స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శుక్రవారం నుండి ఐదు రోజులు పాటు రంపలో పురాతన శివాలయం వద్ద ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసారు. మహాశివరాత్రి తిరునాళ్ళు సందర్భంగా రంప పరిసర ప్రాంతాల పరిధిలోని గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు, స్థానికులు తిరునాళ్ళుకు వచ్చిన భక్తులకు అన్నదానం, ప్రసాదాలు, మంచినీటి సౌకర్యం సేవలు అందిస్తున్నారు. రంపచోడవరం నుండి రంప భక్తులు రాకపోకలు సాగించేందుకు ఆర్ టి సి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో స్వామి వారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ళు సందర్భంగా రంపలో విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

**ఏఎస్పీ ప్రత్యేక పూజలు :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రంపచోడవరం అడిషనల్ ఎస్పీ జగదీష్ అడహళ్లి రంప శివాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శనం చేసుకోవడం జరిగింది. ఆలయ పురోహితులు ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంపచోడవరం సిఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్ కుమార్ రంపలో తిరునాళ్ళు సందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించి వారికి పలు సూచనలు చేయడం జరిగింది.రంపచోడవరంలో..మహాశివరాత్రి సందర్భంగా రంపచోడవరం శివాలయంలోను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు సీతపల్లి వాగులో స్నానాలు చేసి శివాలయాలలో దైవదర్శనం చేసుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పల్లకిలో స్వామి వారిని, అమ్మ వారిని గ్రామంలో ఊరేగించి అనంతరం శివాలయం వద్ద పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సిఆర్పిఎఫ్ బలగాలతో కవాతు



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, డి.ఎస్.పి కె.సిహెచ్. రామారావు ఆధ్వర్యంలో కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో సిఆర్పిఎఫ్ బలగాలతో కవాతుల నిర్వహించారు. రానున్న ఎన్నికల దృశ్య ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా సీఆర్పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించడానికి ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## ఎపిఎన్జీవో ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు







కాకినాడ,మేజర్న్యూస్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎ.పి.ఎన్.జి.జి.ఓ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘం ఆధార్వంలో మహిళా దినోత్సవ వేడుకలు మహిళా విభాగం జిల్లా చైర్ పర్సన్ బి.సుజాత అధ్యక్షత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గుద్దటి రామమోహనరావు మాట్లాడుతూ మహిళ యొక్క విశిష్టత మరియు వారు సాధించిన ప్రగతి గూర్చి చర్చించినారు. నూతనంగా ప్రభుత్వం మహిళల రక్షణకు దిశ పేరుతో ఒక ప్రత్యేకమైన చట్టం, పోలీస్ స్టేషన్లు మరియు యాప్ ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి కి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియచేసారు. మహిళల యొక్క శ్రేయస్సుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన డిమాండ్స్పై చర్చించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాలలో ప్రగతి సాధించిన మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పేపకయల వెంకటకృష్ణ, సహఅధ్యక్షులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరేళ్ళ చంద్రరరావు, జిల్లాసంయుక్త కార్యదర్శిలు ఎన్.ఎం.కే.జి.ప్రసాద్,బి.శ్రీనివాసరావు, కాకినాడ యూనిట్ అధ్యక్షులు ఎ.సత్తిరాజు, కార్యదర్శి రామకృష్ణ, మహిళా విభాగం కన్వినర్ ఎ.దేవి,జిల్లా కోశాధికారి వై.పద్మమీనాక్షి, జిల్లా సంయుక్త కార్యదర్శి వి.కమల, కాకినాడ యూనిట్ ఉపాధ్యక్షురాలు వి.జయలక్ష్మి , కాకినాడ యూనిట్ సంయుక్త కార్యదర్శి బి.వెంకటలక్ష్మి, మహిళా విభాగం క్యాషియర్ టి.దుర్గ, స్టేట్ కౌన్సిలర్ షేక్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## భీమేశ్వర సేవలో సూర్య బ్యూరో బృందం







**సామర్లకోట,మేజర్న్యూస్ :** పంచారామా క్షేత్రమైన కుమార స్వామి భీమేశ్వర ఆలయంలో సూర్య ఉభయగోదావరి జిల్లా ఇంచార్జ్ కొమ్మన సతీష్ వారి బృందంతో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి అభిషేకాలు నిర్వహించి బిల్వార్చన పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చంటిబాబు బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ సూర్య ఉభయ గోదావరి జిల్లా నుంచి కొమ్మన సతీష్ మాట్లాడుతూ పంచారామ క్షేత్రమైన కుమారరామ భీమేశ్వర శివ క్షేత్రం ఎంతో ప్రసిద్ధిగాంచిందని అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రతి ఏటా ఇక్కడ పూజలు నిర్వహించి మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంటుందని తెలిపారు. పూజల అనంతరం భీమేశ్వర స్వామివారిని, బాల త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహక అధికారి నీలకంఠం ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి దేవస్థానం మర్యాదలతో కండువాలు కప్పారు. ఈ ప్రత్యేక పూజలు కార్యక్రమంలో సతీష్ కొమ్మనతో పాటు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ వెంకట బుద్ధ, ఎంప్లాయిస్ అసోసియేషన్ కోశాధికారి దొరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు, కార్యనిర్వాహకాధికారి నీలకంఠం, రాష్ట్ర కార్మిక సంఘం వైసీపీ నాయకులు దవులూరి సుబ్బారావు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాల్గొన్నారు.

## శివ భక్తులకు ముస్లిం సోదరులు అల్పాహార వితరణ

ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పరిష్కరించుకుని స్థానిక జామియా మసీదు వద్ద ముస్లిం యువకులు భక్తులకు అల్పాహారాన్ని వితరణ చేశారు. దీంతో హిందువులు పండగలకు ముస్లింలు తమ ఐక్యతను చాటి చెప్పినట్లు అయింది. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శివరాత్రి రోజున మసీదు వద్ద భక్తులకు అల్పాహారం వితరణ చేయడం ద్వారా అల్లాకు సేవ చేసినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ దిల్బర్ హుస్సేన్, ఎస్ అమీర్, షేక్ బాబు ఖాన్, షేక్ షకీల్, ఎండి అమీర్, షేక్ అలీ భాయ్, షేక్ రబ్బాని, షేక్ నూరు మీరా, షేక్ ఆలీషా, తదితరు ముస్లిం సోదరులు ఉన్నారు.



## వాలంటీర్ మృతిపై తెలుగు మహిళా నాయకురాలు విచారం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** గ్రామ వాలంటీర్ మృతిపై తెలుగుదేశం మహిళా నాయకురాలు గొర్రె సునీత విచారం వ్యక్తం చేశారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని మారేడుమిల్లిలో అనారోగ్యంతో మరణించిన సంతమార్కెట్ వీధి గ్రామ వాలంటీర్ కురసం మౌనిక భౌతికకాయాన్ని టిడిపి రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మృతిపై విచారం వ్యక్తం చేసి, వాలంటీర్ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ రంపచోడవరం ఐటీడీఏ అధికారులు, మౌనిక కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుని, వారికి ఉపాధి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.





## ముమ్మిడివరంలో ప్రచార జోరు

**– దాట్ల సుబ్బరాజు గెలుపుతో ప్రజా ప్రభుత్వానికి నాంది పలకాలని పిలుపు**

**అమలాపురం, మేజర్ న్యూస్ :** ముమ్మిడివరంలో ఎన్నికల ప్రచార జోరు ఊపందుకుంది. తెలుగుదేశం-జనసేన ఉమ్మడి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు నియోజకవర్గంలోని కాట్రేనకోన మండలం బలుసుదిబ్బ, మాసాలదిబ్బ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్చార్జ్ హరీష్ బాలయోగి.. ప్రచారంలో మాట్లాడారు. ప్రతి పల్లెలో టీడీపీ-జనసేన నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల ఫలితాలేంటో ముందే స్పష్టం అవుతోందని పేర్కొన్నారు. ముమ్మిడివరంలో సుబ్బరాజుని అఖండ మెజార్టీతో గెలిపించి, ప్రజా ప్రభుత్వానికి నాంది పలకాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు ఆయన శివరాత్రి సందర్భంగా స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రచారంలో తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పిఠాపురం పాదగయలో అధికారి కాదు... అహంకారి









**- కొద్దినెలల్లో రిటైర్అవుతా..
నేను ఎవరికీ సమాధానం చెప్పక్కర్లేదంటున్న అధికారి**

**- తరతరాల సంప్రదాయానికి విరుద్ధంగా...
భారీ గేట్లతో భక్తుల ఇక్కట్లు**

**- ఈవో ఏకపక్ష నిర్ణయాలతో ఇబ్బందులు పడ్డ మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు**

**- హిందూధార్మిక సంఘాలు, ఉత్సవ కమిటీ సూచనలను పట్టించుకోని ఈవో...**

**- పాదగయ కోనేరు, అంతరాలయం వేరు వేరు కాదంటూ... భక్తుల మండిపాటు**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** దక్షిణ కాశీగా విరాజుల్లుతున్న పిఠాపురం పట్టణంలోని పాదగయ పుణ్య క్షేత్రానికి మహాశివరాత్రి సందర్భంగా లక్షలాదిమంది భక్తులు వచ్చారు. వచ్చిన భక్తులకు తగినట్టుగా ఏర్పాట్లు చేయడంలో.. ఆలయ ఈవో పూర్తిగా విఫలమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం పిఠాపురం పాదయాత్ర క్షేత్రానికి ఈవోగా పులి నారాయణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాధ్యతల స్వీకరించిన నాటి నుండి ఆలయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ... తనఒంటెద్దు పోకడలతో ఆలయ సిబ్బందిని, పురోహితులను సైతం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న టాక్ వినిపిస్తుంది. లక్షలాది మంది భక్తులు పాల్గొనే మహాశివరాత్రి ఏర్పాట్లు సైతం ఈవో నారాయణమూర్తి ఏకపక్ష నిర్ణయాలతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డామని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా కుక్కుటేశ్వర స్వామి దేవస్థానంలో ఒకే సాంప్రదాయం కొనసాగుతుంది. ఆలయానికి అనుసంధానంగా ఉన్న కోనేరులో స్నానాధి కార్యక్రమాలకు పూర్తిచేసి అదే పవిత్రతతో స్వామివారిని దర్శించుకుని తరిస్తారు. కానీ విరుద్ధంగా కోనేరులో స్నానాలు కార్యక్రమాలు అయిన తర్వాత వాళ్లందర్నీ బయట నడిరోడ్డు మీదకు పంపి... అనంతరం దర్శనానికి రావాలంటే మరొక లైన్లో వేచి చూడాల్సిందే అంటూ.. భారీ గేట్లతో సరికొత్త క్యూలైన్లు కట్టడంతో భక్తులు అవాక్కయ్యారు. కోనేరు అంతరాలయంలో అంతర్భాగమని, రెండు వేరువేరు కాదు అని, తెలియకపోతే ఇక్కడ ఉన్న వారిని అడిగి తెలుసుకోవాలని భక్తులు మండిపడుతున్నారు. సదరు అధికారి వ్యవహరించిన తీరుపై భక్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. స్నాన భక్తులు స్నానాలు చేసేందుకు మరియు స్వామి దర్శనానికి ఒకే క్యూ లైన్ ద్వారా భక్తులు లోనికి వెళ్లి బయటికి మార్గంగా ఉండవచ్చే వారు. కానీ ఎన్నడూ లేని విధంగా... భక్తులకు స్నానాలు చేసేందుకు, దర్శనానికి వేర్వేరు దారులు పెట్టి... బారికేడ్లు పెట్టి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడి అసహనానికి లోనయ్యారు. మహిళ భక్తులకు లోనికి వెళ్లే అవకాశం కల్పించకపోవడంలో పలువురు మహిళా భక్తులు బారికేడ్లు మరియు ఆలయ గోడలు దూకి వెళ్లే పరిస్థితిలో ఏర్పడ్డాయి. ఈవో ఏకపక్ష నిర్ణయాలతో వృద్ధులు మహిళలు చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈవో చెప్పారంటూ... ఆలయ సిబ్బంది పలువురు భక్తులను చిన్న పిల్లలను బలవంతంగా బయటికి తోసేశారు. ఈవో సార్ చెప్పారంటూ... తమకు అనుకూలమైన వారిని ప్రక్క మార్గాల గుండా లోపలికి పంపించి దర్శనాలు చేయించడం కనిపించింది. సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా... చర్యలు చేపట్టాలంటే పలు హిందూధర్మిక సంఘాలు వినతి పత్రాలు ఇచ్చి సదరు అధికారిని కోరిన వారి వినతులను సైతం పక్కనపెట్టి తనకు నచ్చిన విధంగా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయడంతో హిందూ ధార్మిక సంఘాలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని హిందూ ధార్మిక సంఘాలు మీడియా ప్రతినిధులు వివరణ కోరే ప్రయత్నం చేయగా... వారికి ఎటువంటి సమాచారం చెప్పకుండా నేనెవరితో మాట్లాడవలసిన పనిలేదని, మరొక నెలలో నేనే రిటైర్ అయిపోతున్నాను నాకు అంత అవసరం లేదని చెబుతున్నారంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేయడం ఇష్టం లేకపోతే పక్కకు తప్పుకోవాలి కానీ తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలకు విరుద్ధంగా ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ఈవో తన ఇష్టానుసారం ఏకపక్ష నిర్ణయాలు ఒంటెద్దు పోకడలతో ఏర్పాట్లు చేయడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన రెండు రోజుల ఉత్సవాలకు సదరు అధికారిని దూరంగా పెట్టి మరొక అధికారిని నియమించి ఉత్సవాలు చేయించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

## తూరంగేశ్వర దేవాలయంలో విశేష పూజలు







**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కాకినాడ రూరల్ నియోజకవర్గం తూరంగి గ్రామంలో వెలిసిన తూరంగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజాము నుండి విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బాబులు తెలియజేశారు. శివనామస్మరణతో తూరంగేశ్వర స్వామి ఆలయం మార్మోగింది కాకినాడ రూరల్ కాకినాడ నగరానికి చెందిన వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బాబులు మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా వేలాది భక్తులు తెల్లవారుజాము నుండి విశేష సంఖ్యలో భక్తులు ఇక్కడికి రావడం జరిగిందని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశానుసారం క్యూ లైన్ పద్ధతి ద్వారా స్వామివారి దర్శనానికి అనుమతించడం జరిగిందని, కోనేటిలో స్నానానికి అన్ని ఏర్పాట్లను చేసామని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు తెల్లవారుజాము నుండి స్వామివారికి నిర్వహిస్తున్నారని తెలిపారు. దాతల సహకారంతో సుమారు 8000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, అంతేకాక గ్రానైట్తో ఆలయ ప్రాంగణమంతా సర్వ సుందరంగా తీర్చిదిద్దేందుకు రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు ఎంతో సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్డూరి చిట్టిబాబు, రమణ, తాతారావు, శ్రీను, వీరబాబు, కదలి సాయి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా చీరలు పంపిణీ





**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా మాజీ మేయర్ మరియు కాకినాడ జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తిరుమల కుమార్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ అభివృధికి అహర్నిశలు పాటుపడి, కష్టకాలంలోపార్టీ వెనుదన్నుగా ఉన్న మహిళా కార్యకర్తలకు సన్మానం చేసి, అనంతరం వృద్ధమహిళలకు చీరలు పంపిణీ చేయటమైనది. ఈ సందర్భంగా సుంకర పావని మాట్లాడుతూ మహిళా సాధికారత దిశగా తెలుగు దేశం పార్టీ అధినేత నార చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ముందడుగు వేసి "కలలకు రెక్కలు" అనే పేరుతో సరికొత్త పథకం తీసుకురావటం జరిగిందన్నారు. ఇంటర్ పూర్తి చేసిన మహిళలు ఈ పథకం క్రింద దరఖాస్తు చేసుకోవటానికి అర్హులన్నారు. నమోదు చేసుకున్న మహిళలు తీసుకొనే బ్యాంకు లోన్కు తెలుగుదేశం-జనసేన ఉమ్మడి ప్రభుత్వం హామీ వహిస్తుందని, వడ్డీని కూడా టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం చెలిస్తుందని, అర్హత కల్గిన మహిళలు దేశంలో ఎక్కడైనా నచ్చిన ప్రొఫెషినల్ కోర్సు చేయవచ్చని పావని తెలియజేసారు. ఇది మహిళా ప్రభుత్వమని, మహిళలు ఆర్థికంగా బలపడాలంటే టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వానికే సాధ్యమని, కాబట్టి రాబోయే ఎన్నికలలో టీడీపీ-జనసేన కూటమికి మహిళలు మద్దత్తు తెలిపి, రాబోయే ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సుంకర పావని తిరుమల కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా కార్యదర్శి,మాజీ ఎంపీటీసీ గుత్తుల సూర్యావతి, జిల్లా కార్యదర్శి బొందల రామలక్ష్మి, బొందల లోకేశ్వరి, చెల్లా పార్వతి, సత్య, మహిళలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో మహిళలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జనాభాలో సగ భాగంగా ఉన్న మహిళలు నేడు అనేక రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు వెళుతున్నారని ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు నేడు అనేక రంగాలలో స్త్రీలు సమున్నత స్థానాల్లో విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జీ.కృష్ణమోహన్ మాట్లాడుతూ సరైన అవకాశాలు ఇస్తే మహిళలు మరింత అభివృద్ధిని సాధిస్తారు అనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. మహిళా ఉపాధ్యాయురాలు ఐ.పద్మావతి మాట్లాడుతూ నేడు సమాజంలో స్త్రీలు అనేక పాత్రల్ని ఒకేసారిగా సమాంతరంగా అద్భుతంగా పోషిస్తున్నారని అన్నారు. ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయురాలు పర్వతిని శేషుమాంబ మాట్లాడుతూ సమాజం అనేక విధాలుగా మారుతున్నా...మూఢనమ్మకాలు, సనాతన ఆచార వ్యవహారాలు సమానత్వ సాధనకు తీవ్ర అవరోధాలుగా ఉన్నాయని అన్నారు. అమ్మాయిలు, అబ్బాయిల పెంపకంలో మార్పులు రావాలని శేషుమాంబ తెలిపారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో ఐ.పద్మావతి, శేషుమాంబ విజయలక్ష్మి లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళాసంరక్షణ కార్యదర్శి కె.ఉషారాణి, రామారావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రేలంగి బాపిరాజు, అడబాల సత్యనారాయణ, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఐడిఎ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక నరసన్న నగర్లో ఉన్న పతంజలి యోగ సాధన కేంద్రంలో కాకినాడ ఐడిఎ సభ్యుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ శిక్షకులు రామచంద్రరాజు మాట్లాడుతూ మా యోగ సాధన కేంద్రంలోని 50 మంది మహిళలకు కాకినాడ ఐడిఎ సభ్యులచే దంతాల ఆరోగ్య సంరక్షణ పట్ల అవగాహన కల్పించటంతోపాటు అందరికీ మల్టీవిటమిన్ సిరప్లు, ఆర్గానిక్ టూత్ బ్రష్లు, మౌత్ వాష్లు అందచేయటం అభినందనీయమని అన్నారు. కాకినాడ ఐడిఎ మహిళల సమాఖ్య అధ్యక్షురాలు డా. పద్మావతి అందరికి దంత ఆరోగ్య సంరక్షణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఐడిఎ అద్యక్షుడు డా. నాగేంద్ర ప్రసాద్, రాష్ట్ర ఐడిఎ సిడిహెచ్ కన్వీనర్ డా. అడ్డాల సత్యనారాయణ, డా. ప్రతిభ, డా. సాయి మాన్విత, యోగ శిక్షకురాలు పద్మజ, షర్మిల, శ్రీరామ్, కాకినాడ ఐడిఎ సభ్యులు మరియు యోగ సభ్యులు పాల్గొన్నారు.

## మోడరన్ గర్ల్స్ హైస్కూల్లో ఆత్మీయంగా మహిళా దినోత్సవ వేడుకలు



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం మోడరన్ అమ్మ హాస్టల్ నందు మోడరన్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినిలతో మోడరన్ విద్యా సంస్థలు అధినేత లయన్ జి.వి.రావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఆత్మీయంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళా సాధికారతను తెలియజేసే పలు చలనచిత్రాల్లోని గీతాలను ప్రదర్శించటం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం జి.వి.రావు మాట్లాడుతూ స్త్రీ లేకపోతే జననం లేదు, గమనం లేదని, ప్రకృతి, పంచభూతాలు కూడా స్త్రీ తత్వాన్ని, వ్యక్తిత్వాన్ని గొప్పగా ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జి. వి.రావు హాస్టల్ విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో మోడరన్ అకడమిక్ డైరెక్టర్స్ ఎ.రమాదేవి, ఆర్.ఉమాదేవి పాల్గొన్నారు.

## మహిళ సాధికారత దిశగా టీడీపీ, జనసేన పార్టీలు

**– టీడీపీ పార్లమెంట్ ఇంచార్జ్ పెచ్చేట్టి విజయలక్ష్మి**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** మహిళ అధ్యక్షురాలు పెచ్చేట్టి విజయలక్ష్మి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మాజీ ఎమ్మెల్యే అనందరావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారత దిశగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మరో కీలక నిర్ణయం తీసుకుని 'కలలకు రెక్కలు' అనే పేరుతో ఓ సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకొచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఏ ఆడబిడ్డ కూడా చదువుకు సంబంధించి డబ్బుల కొరతతో ఇంటికి పరిమితం కాకూడదనే ఆలోచనతో నూతన పథకాన్ని తీసుకుని వచ్చారని విజయలక్ష్మి అన్నారు. నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గెల్లా మీనా కుమారి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఏ తెలుగింటి ఆడబిడ్డ కూడా నిదుల కొరత కారణంగా తమః కలలతో రాజీ పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వేగిరాజు వెంకట ప్రమీల, అప్పారి సుశీల, పేరూరి విజయలక్ష్మి, నిమ్మకాయల పద్మావతి, ముత్తబత్తుల అరుణ, యనమదల లక్ష్మీ, బోడ సీత, కాంద్రేగుల వాణి అచ్యుతం, మట్టపర్తి భారతి,గుమ్మళ్ల నాగమణి,లక్కింసెట్టిసూర్యకుమారి,అంజలి పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో మహిళలపై పెరిగిన దాడులు, అత్యాచారాలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** వై.సి.పి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయని ముత్తా శశిధర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే 70 ఏండ్ల మహిళ అని కూడా చూడకుండా పోలీసు కేసులతో అరెస్టులు కూడా చేయడం చూసామనీ దీనిని ఏనాడు ఉపేక్షించకూడదన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ సిటీ జనసేనపార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో పాలెపు తలుపులమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఏటిమొగ్గ ప్రాంతం ఆంజనేయస్వామి గుడి పరిసర ప్రాంతంలో స్థానిక మహిళలతో కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముత్తా శశిధర్ స్థానిక మహిళలకు శాలువాలు కప్పి సత్కారాలు చేసారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తనకు ఈ ఏటిమొగతో అవినాభావ సంబంధం ఉందనీ తన తండ్రి ముత్తా గోపాలక్రిష్ణ ఈ ప్రాంతాన్ని ప్రత్యేకంగా అభిమానిస్తూ ఇక్కడ ప్రజల కోసం పట్టాలు, ఇళ్ళు తదితర అభివృద్ధి కోసం పాటుపడుతున్నది తాను చూసాననీ, పలు పర్యాయాలు అందులో పాల్గొన్నానన్నారు. మన భారత సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం ఎక్కడైతే స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు నెలకొని ఉంటారని చెపుతారనీ, అంతటి గౌరవం మహిళల పట్ల మనం చూపిస్తూ పాటించాలన్నారు. ఈనాడు మనం మహిళా సాధికారత అంటు చెప్పుకుంటున్నామనీ కానీ ఏనాడో ఇక్కడి స్థానిక మహిళలు పెద్దగా విద్యావంతులు కాకపోయినప్పటికీ తమ దీక్షతో దానిని చేసి చూపించారనీ అన్నారు. నేడు ఈ వై.సి.పి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయనీ, ప్రశ్నిస్తే 70 ఏండ్ల మహిళ అని కూడా చూడకుండా పోలీసు కేసులతో అరెస్టులు కూడా చేయడం చూసామనీ దీనిని ఏనాడు ఉపేక్షించకూడదన్నారు. తామంతా మహిళల గౌరవాన్ని కాపాడుతూ నడుచుకుంటామని స్థానికులతో కలిసి ప్రతినబూనారు. త్వరలో జనసేన తెలుగుదేశం పార్టీల ఉమ్మడి ప్రభుత్వ హయాంలో ఈప్రాంతంలో నివశిస్తున్న విద్యార్థినులకు, మహిళలకు ఇబ్బందులు లేకుండా ఉండే మంచి వాతావరణాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లాడి లక్ష్మి, మల్లాడి నరసమ్మ, బొమ్మిడి ధనలక్ష్మి, మల్లాడి వెంకట లక్ష్మి, కొప్పాడి ధనలక్ష్మి, జనసేనపార్టీ సిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మడ్డు విజయ్ కుమార్, కర్రి రాజు, మల్లాడి వీరబాబు, కర్రి బూరయ్య, ఈశ్వరరావు, పాలెపు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# 8వ డివిజన్లో జనసేన 'యుద్ధానికి మేము సిద్ధమే'



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటిలో జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో స్థానిక 8వ డివిజన్, సాంబమూర్తి నగర్, ఇందిరా కొలనీ, రాజీవ్ గృహ కల్ప వద్ద కొమ్మన సూర్య ప్రకాష్, బడిగంటి సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మన కాకినాడలోనే కావాలి మన నివాసానికి ఇళ్ళ కోసం యుద్ధానికి మేము సిద్ధమే అనే కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తా శశిధర్ మాట్లాడుతూ ముందుగా అక్కడి మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేసారు. తరువాత ఆయన మాట్లాడుతూ శాసనసభ్యులు ద్వారంపూడి స్థానిక ప్రజలను యు.కొత్తపల్లి తీసుకెళ్ళి ఇక్కడ లేఅవుటులో మీకు ఇళ్ళు ఇచ్చేసామని, కొమరిగిరి తీసుకెళ్ళి అక్కడ పట్టాలిచ్చానని చాలా గొప్పగా చెప్పుకుంటున్నారనీ, అరవై నెలల అధికారాన్ని చేతిలో పెట్టుకుని మొదలుపెట్టి ఉంటే ఈపాటికి ఎప్పుడో గృహప్రవేశాకు కూడా అయ్యోవి కాదా మరి ఎన్నికలు నెలరోజులు పెట్టుకుని ఇప్పుడు చెప్పడం ద్రోహం కాదా అన్నారు. ఇప్పుడు సుమారు ముప్పైవేలమందికి ఇళ్ళు ఇచ్చానని చెప్పడం చుస్తుంటే ఎప్పటికి పూర్తవుతాయనీ ఇదంతా చిత్తశుద్ధిగా చేసినది కాదని దుయ్యబట్టారు. దీనికి తోడు నగరంలో పుట్టి పెరిగి జీవిస్తున్న వాళ్ళను నగరబహిష్కరణ చేసి వేరే గ్రామంలో ఇవ్వడం ఏంటని నిలదీసారు. మిమ్మల్ని తీసుకెళ్ళి వేరే ప్రాంతంలో బతకమని పంపితే అపుడు మీకు వీరి బాధ తెలుస్తుందనీ, సాయం చేస్తున్న నెపంతో పేదలను ఇలా చిన్న చూపు చుడటాన్ని జనసేనపార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. లోగడ పదిహేను సంవత్సరాల క్రితం ఈప్రాంతంలోని వారికి సుమారు రెండువందలమందికి ఇక్కడ ఇళ్ళు ఇవ్వడం జరిగిందనీ, ఇప్పుడు వారు వారి పిల్లలు ఇలా కుటుంబాలు పెరిగాయనీ, వీరు ఇరుకిరుకుగా సర్దుకోవాల్సి వస్తోందనీ, వీరందరికీ తమ జనసేన తెలుగుదేశం పార్టీల ఉమ్మడి ప్రభుత్వంలో నగరంలోనే ఇళ్ళు ఇచ్చే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిటీ ఉపాధ్యక్షులు అడబాల సత్యనారాయణ, సిటీ జనరల్ సెక్రెటరీ రమణారెడ్డి, అడపా మాధవ, ధనశేఖర్, ఉషాదేవి, సిహెచ్. త్రిమూర్తులు, అద్దంకి బాబి తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ ఎంత మధురం ఆర్య-అనుల నిండు నూరేళ్ల సావాసం




**– ఈ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మీ జీ తెలుగులో!**

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ఆసక్తికరమైన మలుపులు, ఆకట్టుకునే కథలతో సాగే సీరియల్స్తో తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదం పంచుతున్న ఛానల్ జీ తెలుగు. ఎప్పటికప్పుడు ప్రత్యేక కార్యక్రమాలతో అలరించే జీ తెలుగు తాజాగా పిఠాపురం వేదికగా అభిమానులకు అద్భుత అవకాశాన్ని అందించింది. అశేష ప్రేక్షకాదరణ పొందుతున్న జీ తెలుగు సీరియల్స్ ప్రేమ ఎంత మధురం, నిండు నూరేళ్ల సావాసం నటీనటులు తమ అభిమానులను నేరుగా కలిసేందుకు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించింది. అభిమాన ప్రేక్షకుల మధ్య ఘనంగా జరిగిన కార్యక్రమం ఆర్య-అనుల నిండు నూరేళ్ల సావాసం, మార్చి 10 ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మీ జీ తెలుగులో..! జీ తెలుగు ఇటీవల పిఠాపురలో ప్రముఖ నటీనటులతో కార్యక్రమాన్ని నిర్వహించి వీక్షకులకు ఆహ్లాదకరమైన అనుభవాన్ని అందించింది. ఈ కార్యక్రమం ఆదివారం జీ తెలుగులో ప్రసారం కానుంది. ప్రముఖ యాంకర్ శ్యామల వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమం ఆద్యంతం ప్రేక్షకులకు వినోదం పంచింది. జీ తెలుగు ప్రేక్షకులను మెప్పిస్తూ విజయవంతంగా కొనసాగుతున్న 'నిండు నూరేళ్ల సావాసం', 'ప్రేమ ఎంత మధురం' నటీనటులు ఈ వేదికపై నుంచి తమ అభిమానులతో సంభాషించడమే కాకుండా పలు బహుమతులను కూడా పంచి వారి సంతోషంలో పాలుపంచుకున్నారు. ఈ రెండు సీరియల్స్ తమ నటనతో అలరిస్తున్న బాలనటుల ప్రదర్శనలు ప్రేక్షకులను మరింతగా ఆకట్టుకున్నాయి. అంతేకాదు, సరిగమప గాయనీగాయకుల ప్రత్యేక ప్రదర్శన వీక్షకుల హృదయాలను హత్తుకుంది. నాలుగేళ్లుగా తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఆదరిస్తున్న జీ తెలుగు సీరియల్ ప్రేమ ఎంత మధురం కథానాయకుడు శ్రీరామ్ వెంకట్ (ఆర్యవర్ధన్) ఈ కార్యక్రమం ద్వారా తన అభిమానులను పలకరించి మరింత ఉత్సాహాన్ని జోడించారు. అంతేకాదు ఈ సీరియల్ నుంచి వర్ష (అను), మహేశ్వరి (మాన్సీ), కరమ్ (నీరజ్) కూడా పాల్గొని అభిమానులను అలరించారు. ఇక, మొదటి ఎపిసోడ్ నుంచీ విశిష్ట ప్రేక్షకాదరణతో దూసుకుపోతున్న నిండు నూరేళ్ల సావాసం సీరియల్ నటీనటులైన రిచర్డ్ జోస్ (అమరేంద్ర), పల్లవి గౌడ (అరుంధతి), నిసర్గ గౌడ (భాగమతి), నవ్య రావు (మనోహరి)తోపాటు పిల్లలు కూడా పాల్గొని తమ అద్భుత ప్రదర్శనలతో మరచిపోలేని అనుభూతుల్ని పంచారు. జీ తెలుగు నటీనటులు తమ అభిమానులతో సెల్ఫీలు దిగడం, బహుమతులతో సర్ ప్రైజ్ చేయడంతోపాటు వారిని పలకరించి ముచ్చటించారు. దేవాలయాల సందర్శన నుంచి అభిమానుల ఇళ్లలో ఆనందాన్ని పంచడం వరకు ప్రేమ ఎంత మధురం, నిండు నూరేళ్ల సావాసం నటీనటులు చెరగని అనుభూతులు పంచారు. ఘనంగా జరిగిన ఈ సరదా సంబరాన్ని జీ తెలుగు వేదికగా మీరూ మిస్ కాకుండా చూసేయండి..!

సూర్య
తూర్పుగోదావరి
శనివారం
9 మార్చి 2024


## రాక్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** రాక్ సిరామిక్స్ పరిశ్రమలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్నిఘనంగా నిర్వహించారు. పరిశ్రమలో మహిళా ఉద్యోగులను, మహిళా కార్మికులను పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ కల్లోల్ కుమార్ ఘోష్ ఘనంగా అభినందించి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు యొక్క ప్రాధాన్యత గురించి వివరించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుంది అని సంస్థ వైస్ ప్రెసిడెంట్ కల్లోల్ కుమార్ ఘోష్ అన్నారు. మహిళల ఆరోగ్య పర జాగ్రత్తపై మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నవీన్ వివరిస్తూ ఆరోగ్య చిట్కాలు, వడ దెబ్బ, సి పి ఆర్ టెక్నిక్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ హెచ్ ఆర్ అండ్ అడ్మిన్ టి. నిరజ్ కుమార్, సేఫ్టీ మేనేజర్ బాలాజీ, పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ వి జి యెస్ కుమార్, రాక్ సంస్థ లో పని చేసే మహిళా ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ 1,01,116లు విరాళం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భద్రాచలంకు చెందిన పాకల దుర్గా ప్రసాద్, లక్ష్మి దంపతులు రూ.1,01,116లు విరాళమును దేవస్థానం పిఆర్వో దామెర కృష్ణారావుకు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చే వడ్డీతో జూన్ 12వ తేదీన అన్నదానం జరిపించవలసిందిగా దాత కోరారు. ఈ సందర్భంగా దాతలను పిఆర్వో కృష్ణారావు అభినందించారు.

# నిరాశలో ప్రత్తిపాడు టిడిపి శ్రేణులు

- జాప్యం అయితే - విజయానికి ఆటంకాలే
- సరి చూసుకుంటే - విజయం మీ ముంగిట అలసత్వం వహిస్తే
- విజయం అంచున ఓటమి

**రౌతులపూడి, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో మొట్ట మొదటిదిగా విజయం సాధించే ప్రతిపాడు నియోజక వర్గం టిడిపి సీటు.గెలిచే అభ్యర్థి వరపుల సత్య ప్రభ రాజాకు ప్రకటించకపోవడంపై టిడిపి శ్రేణులు నిరాశ చెందుతున్నారు.రాష్ట్ర రాజకీయాలలో ప్రతిపాడు మెట్ట ప్రాంతం నియోజకవర్గానికి ఒక విశిష్టత ఉంది. నియోజకవర్గంలోని వరుపుల,పర్వత ముద్రగడ కుటుంబాల నుండి ఎవరు విజయం సాధించిన అదే ఒక చరిత్ర అవుతుంది.ఒకరికి ఒకరు పోటీ అన్నట్టుగా ప్రజా అభిమానాన్ని సంపాదించారు. ఆకోవలోనే అతి తక్కువ కాలంలో వరుపుల కుటుంబము నుండి రాజా అనే ప్రజా నాయకుడు ఉద్భవించాడు.ప్రతిపాడు నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్ర జిల్లా ప్రజా ప్రతినిధులు,ప్రజలు ఆశీస్సులు పొందారు.టిడిపిని కంచుకోటగా నిలబెట్టారు.విధి వెంటాడడంతో 2023 వ సంవత్సరం మార్చి 4వ తారీఖున ఆయన ఆకాస్మిక మరణం టిడిపి పార్టీకి,నియోజక ప్రజలకు తీరని లోటు.రాజా గత 2019 ఎన్నికల్లో కొద్దిపాటి తేడాతో ఓటమి పొందిన అది ప్రజల్లో గెలుపు మాత్రమేనని సీనియర్ నాయకులు, రాజకీయ విశేషకులు విశ్లేషణ. రాష్ట్ర రాజకీయాల్లో చక్ర%శీ% తిప్పిన రాజాకు ప్రజాభిమానం మిండే. ఉభయగోదావరి జిల్లాలోను, ప్రత్తిపాడు నియోజవర్గంలో వరపుల ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి,పార్టీలకు కులాలకు అతీతంగా ప్రజాభిమానాన్ని సంపాదించుకున్నారు.అయితే ఆయన మరణానంతరం రాజా సతీమణి సత్య ప్రభ రాజాకు టిడిపి నియోజకవర్గ పగ్గాలు అప్పగించారు. కుటుంబం ఆర్థిక కష్టాలలో ఉన్న ప్రజా శ్రేయస్సు ముఖ్యమంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజలకు తీసుకువెళ్లారు ఆమె.ఎన్నికలు కొద్దిరోజుల్లో ఉన్న సమయంలో నేటికీ ప్రత్తిపాడు టిడిపి సీటు ప్రకటించకపోవడంపై




టిడిపి పార్టీ అభిమానులు ఆందోళన చెందుతున్నారు. టిడిపి,జనసేన,బిజెపి పార్టీల పొత్తులతో ఆయా పార్టీల అభ్యర్థులను ప్రకటిస్తారేమోనని ప్రచారం సాగుతుంది. మరో వైపు ఆర్థిక బలం, క్యాడర్లో ఎవరికి వారే యమునా తీర%శీ%టూ నియోజకవర్గ ప్రజలలో రక రకాల పుకార్లు శికార్లు చేస్తున్నాయి. టిక్కెట్ నేటికి ప్రకటించక పోవడానికి జాప్యం పార్టీలో వర్గపోరు, పార్టీ నాయకులను కార్యకర్తలన సమన్వయం పర్చలేని స్థితిలో ఉన్నారని నాయకుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి.పార్టీ అభివృద్ధి కంటే కుల మతాలకే పెద్ద పేట వేసారని ఆమెపై కొన్ని మండలాల్లో నాయకులు పార్టీ పెద్దలు వద్దకే పంచాయతీకి వెళ్లినట్లు సమాచారం.

ఇటువంటి కారణాలతోనే పార్టీ అధిష్టానం ఆలోచిస్తుందని మరొక వర్గ నాయకులు విమర్శిస్తున్నారు. పార్టీకి కష్టపడి పనిచేసిన వారిని పక్కన పెట్టారని విమర్శలు లేకపోలేదు.గ్రామాలలో కార్యకర్తలను సమన్వయ పరచకుండా ఒక్క వర్గానికి వత్తాసు పలుకుతుండడంతో టిడిపి గోడ దూకే ప్రయత్నంలో కొందరు కార్యకర్తలు రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిణామాలతో సత్య ప్రభ రాజా నాయకత్వానికి మైనస్‌గా చూపుతున్నారు.సరి చేసుకొని ముందుకు వెళ్ళవలసిన పరిస్థితి సత్య ప్రభ రాజాపై ఉంది అని పలువురు రాజకీయ నాయకులు అభిప్రాయగా తెలుస్తోంది.ప్రతీ ఒక్కరు ప్రతి ఒక్క ఓటు విజయాన్ని తొలిమెట్టుగా గుర్తించాలి. నిర్లక్ష్యం వహిస్తే విజయ%శీ% అంచున ఓటమి తప్పదు అని హెచ్చరిస్తున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నియంత నిర్ణయాలు టిడిపికి కలిసి వచ్చే అవకాశం ఉందంటున్నారు.

మరో వైపు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు ప్రతిపాడుకు వైయస్సార్ పార్టీ ఇన్చార్జిగా నియమించింది. నియోజవర్గంలో సీనియర్ నాయకులు బంధు వర్గం, స్నేహభావం, కార్యకర్తలను బలపరుచుకుంటూ విజయానికి సై అంటూ ప్రచారంలో దూసుకుపోతున్నారు.టిడిపి టికెట్ ప్రకటించడం జాప్యం అయితే పార్టీ మనుగడకే నష్టం.కొందరు వైయస్సార్ గూటికి చేరే అవకాశాలు లేకపోలేదు.పార్టీ అధిష్టానం ఇంకా జాప్యం వహిస్తే, విజయ అంచున బోల్తా పడిన ఆశ్చర్యపోనక్కర్లేదని కార్యకర్తల అభిప్రాయంగా తెలుస్తోంది. పొత్తుల అంటూ ఏ పార్టీ అభ్యర్థికి సీటు ప్రకటించిన టిడిపి ఓడిపోవడం ఖాయం అంటున్నారు.సత్య ప్రభ రాజాకే విజయ అవకాశాలు ఎక్కువ ఉన్నాయని పార్టీ విశేషకులు భావిస్తున్నారు.స్వర్గీయ రాజా సేవా కార్యక్రమాలు,రాజా సానుభూతి వైయస్సార్ పార్టీ వ్యతిరేక నిర్ణయాలు ఆమె విజయానికి సోపానాలని పార్టీ శ్రేణులు ఆశిస్తున్నారు.స్వర్గీయ వరుపుల రాజా అభిమానం సానుభూతి ముందు డబ్బు, ఆర్థిక బలగం,మందు ఆర్భాటాలు మరి ఏదీ సరితూగదని అభిమానుల అభిప్రాయము.సత్య ప్రభ రాజాకు తమ మద్దతుగా నియోజకవర్గ ప్రజలు మేమున్నామంటూ అభయమిస్తున్నారు. ఏది ఏమైనా అధిష్టానం నిర్ణయం కోసం ఎదురు చూడవలసిన పరిస్థితి ప్రత్తిపాడు టిడిపి పార్టీది. వరుపుల సత్య ప్రభ రాజాకు ప్రత్తిపాడు టిడిపి టిక్కెట్ ప్రకటించాలంటూ..... ఆశతో... ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలు.

## భీమేశ్వరుని సేవలో స్వచ్ఛంద సంస్థలు



సామర్లకోట, మేజర్ న్యూస్ : పంచారామ క్షేత్రం అయిన శ్రీ చాళుక్య కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం వివిధ స్వచ్ఛంద సంస్థలు భక్తులకు విశేష సేవలు అందించాయి. నాగ చతుర్దశి రోజున మహాశివరాత్రి కావడంతో తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. లయన్స్ క్లబ్, ఉప్పు వారి సత్రం, కొండపల్లి కృష్ణమూర్తి బ్రదర్స్, ఫ్రెండ్స్ ఫరెవర్, భారతీయ స్టేట్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో పాలు, రొట్టెలు, మజ్జిగ, పులిహోర, అల్పాహారం, త్రాగునీరు భక్తులకు అందజేశారు. ఇంకా మాదుగులమ్మ ఆలయం ఆధ్యర్యంలో భక్తులకు అల్పాహారం అందజేశారు. ఇంకా పట్టణం లోని గాంధీబొమ్మ సెంటర్‌లో యార్లగడ్డ వెంకట సుబ్బారావు మెమోరియల్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు సేవల నందించిన స్వచ్ఛంద సంస్థలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, పెద్దాపురం నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దవులూరి దొరబాబు, ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం తదితరులు అభినందించారు.

## నేడు, రేపు కూడా ఆస్తి పన్నుల స్వీకరణ

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- కమిషనర్ జే.వెంకటరావు సూచన



**కాకినాడ, మేజర్ న్యూస్ :** పన్ను చెల్లింపు దారుల సౌకర్యార్థం సెలవు రోజులైనప్పటికీ ఈనెల 9,10 తేదీలలో కూడా పన్నులను స్వీకరిస్తామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జే. వెంకటరావు ఒక ప్రకటనలో చెప్పారు. సినిమా రోడ్‌లోని పాత మున్సిపల్ కార్యాలయంతోపాటు, అన్ని సచివాలయాలలో పన్నులు స్వీకరిస్తామన్నారు. అస్థి, ఖాళీ స్థలాల పన్నులకు సంబంధించి పాత బకాయిలపై వడ్డీ రాయితీ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుం దన్నారు. అందువల్ల పాత, ప్రస్తుత ఆర్థిక సంవత్సర పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బకాయిలు చెల్లించాలని కమిషనర్ కోరారు.

## అక్రమంగా పిడీయస్ రైస్ తరలిస్తున్న వాహనం బోల్తా



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** గండేపల్లి మండలంలో జెడ్.రాగంపేట హైవే మార్గంలో అక్రమంగా పిడీయస్ రైస్ తరలిస్తున్న వాహనం శ్రీ వీర పేరంటాల అమ్మ వారి గుడి ఎదురుగా అతి వేగం తో అదుపు తప్పి ప్రమాదానికి గురి అయ్యింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తీవ్ర మైన గాయం కావడం స్పృహ కోల్పోయాడు. కొంతమంది ప్రయాణికులు గాయాలకు గురయ్యారు. ఈ ప్రమాద సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది మరియు పలు ప్రముఖ పత్రిక విలేకర్లు అక్కడకు చేరుకునీ ప్రమాద బాధితులను హాస్పిటల్ చేర్పించి చికిత్సను అందిస్తున్నారు. ఇదిలా ఉండగా ఉదయం 7 గంటలకు ప్రమాదం జరిగి జరిగిన సమాచారం పలు అధికారులకు ఇచ్చినప్పటికీ అధికార బృందం నిర్లక్ష్యం చేయడం పలు ఆలోచనలకు దారి తీస్తున్నాయి.

చాలా సేపటి తరువాత అక్కడకు చేరుకున్న పోలీసులు మరియు విజిలెన్స్ అధికారులు ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి అక్రమంగా తరలిస్తున్న రైస్ వాహనాలను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అనంతరం ఈ విషయంపై డిఎస్‌వో ఆఫీసర్ ప్రసాద్ మాట్లాడుతూ ఇక్కడ జరిగిన ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి పలు చర్యలు చేపట్టామని మరియు అక్రమంగా తరలిస్తున్న పి డీ ఏస్ రైస్ ను వారు వాహనాలను సంబంధిత అక్రమ దారులను అదుపులోకి తీసుకుని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌వో కృష్ణ, విజిలెన్స్ ఆఫీసర్ నాగరాజు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## వెలమ లక్ష్మణరావు లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు ఫలహారం పంపిణీ



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** మహాశివరాత్రి సందర్భంగా వెలమ లక్ష్మణరావు లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక ఇసుక రేవు దగ్గర శివరాత్రికి వచ్చిన భక్తులకు బ్రెడ్స్, పులిహోర, పాలు, సుమారు 2000 మందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ మేడపాటి షర్మిల రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వచ్చిన భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెలమ లక్ష్మణరావు లక్ష్మీ దంపతులు గత పది సంవత్సరాలుగా శివరాత్రికి వచ్చే భక్తులకు ప్రతి సంవత్సరం అల్పాహారం అందజేస్తున్నారని అలాగే రాజమండ్రిలో వివిధ స్వచ్ఛం ద సేవా సంస్థలు తమ వంతుగా భక్తులకు వివిధ రూపాల్లో వితరణ అందజేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కంచి ప్రభాకర్, గద్దె ధనలక్ష్మి, నాగమణి, సత్యలత, రేవు దుర్గారావు, హరీష్, కంచి రవి, చిన్ని, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభ్యున్నతి టిడిపి - జనసేనతోనే సాధ్యం

- వసంతవాడ, పేరవరం గ్రామాల్లో టీడీపీ పార్టీలోకి చేరికలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** టిడిపి జనసేన ఉమ్మడి ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం లభిస్తుందని, రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు బండారు సత్యానంద రావు అన్నారు. శుక్రవారం ఆత్రేయపురం మండలం వసంతవాడ, పేరవరం గ్రామాల్లో వైసీపీని వీడి పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రెండు గ్రామాల నుంచి పెన్మత్స వెంకట సత్య సూర్యనారాయణరాజు, పేరిచర్ల రమేష్, పెన్మత్స రామలింగరాజు, పేరిచర్ల సీతారామరాజు, పెన్మత్స రాధాకృష్ణంరాజు, పెన్మత్స ఫణి, మార్గాని గోపి, మార్గాని రాజేష్ తదితరులు పార్టీలో చేరడంతో పేరవరం వసంతవాడ గ్రామాల్లో పార్టీకి భారీ విజయం సాధించేందుకు అందరు కలిసి కృషి చేయాలని టీడీపీ జెనసేన ఉమ్మడి అభ్యర్థి సత్యానందరవు పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముల్లపూడి భాస్కరరావు, దండు రాంబాబు తదితరులు ఉన్నారు.

## టిడిపి కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు



**పి. గన్నవరం, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు సంసాని లక్ష్మీ గౌరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన పార్టీల మేనిఫెస్టోలో మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. వచ్చే ఎన్నికలలో మహిళలందరూ తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, తదితర తెలుగుదేశం జనసేన పార్టీలకు చెందిన మహిళ నేతలను కార్యకర్తలను పెచ్చెట్టి విజయలక్ష్మి, సంసాని లక్ష్మీ గౌరీ సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## అంగరంగ వైభవంగా శివరాత్రి



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట మండలం రాజుపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి వేకువ జామున 4 గంటల నుండి విశేష పంచామృత అభిషేకములు ప్రత్యేక పూజలతో ఆలయ రాజపూడి శివాలయంలో శివరాత్రి సందర్భంగా.సుమారు 500కడవలతో శివునికి అభిషేకం 20.000వేల మందికి అన్నదానం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. మహాశివరాత్రి సందర్భంగా శ్రీ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారికి నేడు రాత్రికి 8:30 నుండి రాత్రి 1: 30 నిమిషముల వరకు స్వామివారికి మహాన్యాస ఏకాదశి పూర్వక రుద్రాభిషేకం జరుగుతుంది. కావున భక్తులందరూ వచ్చి ఈ రుద్రాభిషేకంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించవలసిందిగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొండబాబు భక్తులని ఇది విధి పార్టీ నాయకులు జగ్గంపేట టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, వైఎస్ఆర్ పార్టీ మాజీ మంత్రి జగ్గంపేట ఇంచార్జ్ తోట నరసింహం, వివిధ పార్టీ నాయకులు అధికారులు భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శివ నామస్మరణతో మార్మోగిన పంచారామం క్షేత్రం -ప్రముఖుల దర్శనాలు





**సామర్లకోట, మేజర్ న్యూస్ :** హరహర మహాదేవ శంభో శంకర అనే ఓం..కార నామంతో పంచారామా క్షేత్రమైన సామర్లకోటశ్రీ కుమార రామ భీమేశ్వరాలయం మార్మోగింది. మహా శివరాత్రి పర్వదినం కావడంతో శుక్రవారం లక్ష సంఖ్యలో భక్తులుతరలి రాగా ఆలయ పరిసరాలు శివనామ స్మరణతో ఎంతో సందడిగా మారాయి. మహా శివరాత్రి సందర్భంగా తెల్లవారు జాముఒంటి గంటకు భీమేశ్వరునికి పిఠాపురం మహారాజా వారి గోత్ర నామాలతో శాస్త్రోక్తంగా తొలి అభిషేక పూజలను నిర్వహించారు. అప్పటికే క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు ఒక్కసారిగా భక్తి పారవశ్యంతో శివుని ధర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పుష్కరిణిలోనూ, ఆలయ ముఖద్వారమైన ఆర్చి వద్ద గల పవిత్ర గోదావరి కాలువలో, దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన జల్లు స్నానఘట్టం వద్ద భక్తులు అధిక సంఖ్యలో పవిత్ర స్నానాలాచరించారు. ఇదిలా ఉండగా గతంలో మహా శివరాత్రి పర్వదినంసందర్భంగా తెల్లవారుజాము ఒంటి గంట నుంచే ధర్శనానికి భక్తులు ఎగబడుతూ రాగా గత రెండేళ్లుగా ఉదయం 6 గంటల తర్వాత భక్తుల తాకిడి ప్రారంభమైంది. ఉదయం 11 గంటల వరకు భక్తులు రాక భారీగా జరిగింది. తదుపరి క్రమంగా శివుని దర్శనాలను భక్తులు చేసుకుని తరించారు. దానితో ఆలయ ప్రాంగణాలు, క్యూలైన్లు భక్తులతో కితకిటలాడాయి. ఆలయానికి చేరుకునేందుకు శాశ్వత వంతెనతో పాటు ఇనుప కాలిబాట వంతెనను ఏర్పాటు చేయగా రెండువంతెనలను, మాండవ్య నారాయణ స్వామి ఆలయం వద్ద గల వంతెనను రాక పోకలకు భక్తులు ఉపయోగించుకున్నారు.

**-ప్రముఖుల దర్శనం...** మహా శివరాత్రి పర్వదినం కావడంతో భీమేశ్వరాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి శివుని దర్శించుకున్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో పాటు పెద్దాపురం వైసీపీ ఇంచార్జి దవులూరి దొరబాబు, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, పెద్దాపురం ఆర్డీవో జె సీతా రామారావు, పలువురు జడ్జిలు ఇతర ప్రముఖులు ఆలయంలో ప్రత్యేక పూజలను చేపట్టి తరించారు. ఈ సందర్భంగా అతిధులను ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ నంది మండపంలో ప్రత్యేక ఆశీర్వచన పూజలను జరిపించి ఆశీర్వదించారు. కాగా తెల్లవారు జామునుంచి రాత్రి వరకు ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య లక్ష మందికి పైగా ఉంటారని అధికారులు అంచనా వేసారు.

## తోట నరసింహం, సునీల్ గెలుపే ధ్యేయంగా పని చేయాలి

- ఒమ్మి రఘురామ్



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట నియోజకవర్గ వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోట నరసింహంను, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ గెలుపుకు ప్రతి ఒక్కరూ సైనికులుగా చేయాలని వై యస్ ఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాకినాడ జిల్లా జె సి యస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్ అన్నారు. జగ్గంపేట మండల పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభ్యర్థుల గెలుపుకు కృషి చేసి మరొకసారి జగనన్నని ముఖ్యమంత్రి ని చేసి పేదలకు మేలు జరిగేలా చూడాలన్నారు.జగ్గంపేట ఎంపీటీసీ 4 చెరుకూరి జయరాజు మాట్లాడుతూ జగ్గంపేట వై సి పీ కంచుకోట అని అభ్యర్థి తోట నరసింహం గారిని గెలిపించి హ్యాట్రిక్ సాధిస్తామన్నారు. జగ్గంపేట ఎంపీటీసీ 3 ఆకుల శ్రీధర్ మాట్లాడుతూ ఎవరు ఎన్ని రకాల కుట్రలు చేసినా తోట నరసింహం గెలుపు ఎవరూ ఆపలేరన్నారు. మండల సేవాదళ్ కన్వీనర్ కిలపర్తి వీరబాబు మాట్లాడుతూ మంత్రిగా, పార్లమెంట్ సభ్యునిగా పనిచేసిన అనుభవం గల నరసింహంని గెలిపిస్తే నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది అన్నారు. జగ్గంపేట ఎంపీటీసీ 5 గొల్లపల్లి శ్రీను మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలు జగనన్న ను మరొక సారి ముఖ్యమంత్రిని చేస్తాయన్నారు. టౌన్ ప్రెసిడెంట్ కాపవరపు ప్రసాద్ మాట్లాడుతూ పార్టీకి అందరూ నిబద్ధతతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ రెడ్డి భాను ప్రతాప్, నీలపల్లి అప్పారావు, కోరాడ సుబ్బారావు, పచ్చిపులుసు వీరబాబు, బంటు బుజ్జిబాబు, దత్తి శ్రీనివాసు, సాకా రాజ్ కుమార్, వేమగిరి రవి, మేడిశెట్టి బాలకృష్ణ, పైలా చైతన్య, కొల్లు యేసు, ఈగల శివ కాటన్, నక్కా వీర బ్రహ్మం, ఇసరపు లోవ, గొల్లపల్లి ప్రసాద్, ముక్కా నాగు, లావేటి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి



-గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : స్కీం వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద సిఐటియు మండల అధ్యక్షులు కే వెంకటలక్ష్మి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లోతా రామారావు మాట్లాడుతూ, 20వ శతాబ్దంలో యూరప్‌కు చెందిన కార్మిక ఉద్యమం ద్వారా మహిళల హక్కుల కోసం చరిత్ర పుటల్లో నమోదైన అనేక ఉద్యమాల్లో ఈ ఉద్యమం ఒకటన్నారు.మొదటి మహిళా దినోత్సవాన్ని 1909 ఫిబ్రవరి 28న అమెరికాలో జరుపుకున్నారన్నారు.1908లో న్యూయార్క్‌లో జరిగిన గార్మెంట్ సమ్మె జ్ఞాపకార్థం సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికా దీనిని నిర్వహించింది. ఈ నిరసనలో మహిళలు పని పరిస్థితులు సరిగా లేకపోవడంతో సమ్మెకు దిగారని దీని తరువాత, 1910లో, డెన్మార్క్‌లోని కోపెన్‌హాగన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సమావేశంలో క్లారా జెట్‌కిన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రతిపాదించారని ఈ ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించారని,ఈ ప్రతిపాదన తర్వాత, 1911లో అనేక ఐరోపా దేశాలలో మొదటి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారని దీనిలో లక్షలాది మంది పాల్గొనేవారు మహిళల హక్కుల కోసం తమ గళాన్ని వినిపించారన్నారు.ఆనాటి నుంచి నేటి వరకు మహిళల హక్కులు,ఆత్మగౌరవం కోసం గళం విప్పి నాటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారుని తెలిపారు.అయితే ఐక్యరాజ్యసమితి 1975లో ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రారంభించిందిని రెండేళ్ల తర్వాత 1977లో యూఎన్ జనరల్ అసెంబ్లీ మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించిందిని ఇలా మహిళా దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయన్నారు., సాంస్కృతిక,ఆర్థిక, సామాజిక,రాజకీయ సమానత్వాన్ని సాధించడానికి మహిళలను ప్రోత్సహించడం ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు,.ఈ రోజున మహిళలకు సమాజంలో సమాన హక్కులు కల్పించాలని తద్వారా వారి హక్కుల పై అవగాహన కల్పించడం దీని ఉద్దేశం అన్నారు, సమాజంలో స్త్రీ పురుషుల మధ్య వివక్ష వివక్షను రూపుమాపడం ద్వారా సమానత్వాన్ని తీసుకురావడానికి మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటారని పురుషులు స్త్రీల మధ్య శారీరక వ్యత్యాసాల కారణంగా సమాజంలో వారి పాత్రలు సంవత్సరాలుగా సెట్ చేయబడ్డాయని,దానికి అనుగుణంగా మహిళలు ఆ నియమాలు పాటించాలని భావిస్తున్నారని తెలిపారు. సమాజంలో వేళ్లానుకున్న అసమానతులకు మహిళా దినోత్సవం ఒక సవాల్ అని, ఇది మాత్రమే కాదని ఈరోజు మహిళలు తమ కుటుంబం, వారి స్నేహితులు,వారి సమాజం,వారి దేశం కోసం చేసిన అన్ని పనులకు ధన్యవాదాలు తెలిపే రోజు కూడా అని అన్నారు, ఈ కార్యక్రమంలో అంగన్వాడి, ఆశ,మిడ్ డే మీల్స్ సంఘాలనాయకులుసిహెచ్‌కుమారి, రమణి,రాజేశ్వరి, చిన్నమ్మలు,మేరీ,రత్నం,భవాని,రాధ, లక్ష్మి,సత్యవతి,సరస్వతి, సిఐటియు నాయకులు రామరాజు తదితరులు వున్నారు.

## భక్తులకు పాలు పంపిణీ చేసిన అవంతి ఫౌండేషన్



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** మహాశివరాత్రి సందర్భంగా కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో పిల్లలకు, వృద్ధులకు, భక్తులకు అవంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 15 వేల మందికి ఉచితంగా పాలు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా అవంతి ఫౌండేషన్‌కి చెందిన అల్లూరి శ్రీ తులసి మాట్లాడుతూ ప్రతి శివరాత్రికి గోష్పాద క్షేత్రంలోని భక్తులకు ఉచితంగా పాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా అవంతి ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అవంతి ఫీడ్స్ డీజీఎం డి. రామకృష్ణ, సీనియర్ మేనేజర్ అమ్మిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## హరహర మహదేవా.. శంభోశంకర అంటూ మారుమ్రోగిన శివాలయాలు



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం నాడు కొవ్వూరు గోష్పాద క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. కొవ్వూరు పరిసర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానమాచరించారు. తెల్లవారుజామున నుండే భక్తులు అధిక సంఖ్యలో గోష్పద క్షేత్రానికి రావడంతో మినీ పుష్కరంగా మారింది. క్షేత్రమంతా శివనామస్మరణతో మారుమోగింది. శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత సుందరేశ్వర స్వామి దేవాలయం లో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శ్రీ బాల త్రిపుర సుందరి అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య ఏర్పాట్లను అధికారులు చేపట్టారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పడవలను ఏర్పాటు చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. గోష్పద క్షేత్రంలోని ఆలయాలు అన్ని భక్తులతో నిండిపోయాయి.

# వైభవోపేతంగా పెరవలి మండలంలో మహాశివరాత్రి వేడుకలు

**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి మండలంలో మొత్తం 18 గ్రామాలు ఉండగా అందులో 15 గ్రామాల్లో శివాలయాలు ఉన్నాయి ఈ 15 ఆలయాల్లో 10 ఆలయాలు వశిష్ట గోదావరి తీర ప్రాంతం లో గల 10 గ్రామాల్లో కొలువై ఉన్నాయి మార్చి ఎనిమిదో తేదీ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెరవలి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు వేకువ జామునే గోదావరి నది స్నానానికి వెళ్లి అనంతరం ఆయా గ్రామాల్లోని పార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. పెరవలి మండలంలోని శివాలయాలు ఈ మధ్య కాలంలో కట్టినవి రెండే కాగా మిగతావన్నీ పురాణ ప్రసిద్ధి కాంచినవి స్వయంభు లింగాలుగా పేరుందినవి కావడంతో మహాశివరాత్రికి ఈ గ్రామాల్లో భక్తులు స్వామివారి దర్శనానికి దూర ప్రాంతాల నుండి వస్తుంటారు పెరవలి మండలంలో తీపర్రు మల్లేశ్వరం ముక్కామల గ్రామాల్లో రథోత్సవాలు నిర్వహించారు. మరికొన్ని గ్రామాల్లో ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి పల్లకి ఉత్సవాలు నిర్వహించారు అన్ని గ్రామాల్లోనూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండటం కోసం ఈవోలు ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గ్రామస్తుల సహకారంతో మహాశివరాత్రిని పురస్కరించుకుని భక్తులకు అన్న సమారాధనలు నిర్వహించారు. పెరవలి మండలం తీపర్రు గ్రామంలో వేంచేసిఉన్న శ్రీ రాజ రాజ నరేంద్ర స్వామివారిని నిడదవోలు నియోజకవర్గ శాసనసభ్యులు జి.శ్రీనివాస్ నాయుడు సతీమణి సుమలత వారి



కుమారుడు వరుణ్ సాయి తీపర్రు వైస్ ప్రెసిడెంట్ కుందుల భూపతిరావు తదితరులు దర్శించుకున్నారు. తీపర్రు గ్రామంలో కుందుల వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన ఇంటి వద్ద భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పెరవలి మండలంలో నెలకొన్న శివాలయాల్లో ప్రతి గ్రామంలోనూ ఒక్కో విశిష్టత సాంప్రదాయం కలిగి ఉన్నాయి కానూరు గ్రామంలో ఉమా రామలింగేశ్వర స్వామి పేరుతో తీపర్రు గ్రామంలో రాజరాజ నరేంద్ర స్వామి పేరుతో కానూరు అగ్రహారం గ్రామంలో ఉమా రామలింగేశ్వర స్వామి పేరుతో కాకరపర్రు గ్రామంలో రాజరాజ నరేంద్ర స్వామి పేరుతో ఉసులుమర్రు గ్రామంలో ఉమా రామలింగేశ్వర స్వామి పేరుతో అజ్జరం గ్రామంలో ఉమామహేశ్వర స్వామి పేరుతో పెరవలి గ్రామంలో పార్వతి విశ్వేశ్వర స్వామి పేరుతో కాపవరం గ్రామంలో ఉమా రామలింగేశ్వర స్వామి పేరుతో కొత్తపల్లి అగ్రహారం గ్రామంలో ఉమా ముక్తేశ్వర స్వామి పేరుతో ముక్కామల గ్రామంలో ఉమా సోమేశ్వర స్వామి పేరుతో అన్నవరప్పాడు గ్రామంలో ఉమా విశ్వేశ్వర స్వామి పేరుతో మల్లేశ్వరం గ్రామంలో కపిల మల్లేశ్వర స్వామి పేరుతో కడింపాడు గ్రామంలో అన్నపూర్ణ సిద్దేశ్వర స్వామి పేరుతో పిట్టల వేమవరం గ్రామంలో ఉమా సోమేశ్వర స్వామి పేరుతో ఖండవల్లి గ్రామంలో మార్కండేయ మృకండేశ్వర స్వామి వారి పేరుతో అన్నవరప్పాడు జాతీయ రహదారి ప్రక్కన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధిలో స్పటిక లింగ మహామహేశ్వరుని పేరుతో శివాలయాలు కొలువుతీరి ఉన్నాయి. ఈ ఆలయాలన్నీ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించేందుకు రావడంతో శుక్రవారం తెల్లవారుజామునుండే ఆలయాలన్నీ కిటకిటలాడాయి. రుద్రాభిషేకాలు పంచామృతాభిషేకాలు ప్రతి ఆలయంలో జరిగాయి. ముక్కామల గ్రామంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారి పలుగు సంబరం మహోత్సవం ముక్కామల శ్రీ వీరభద్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది మహాశివరాత్రి సందర్భంగా అన్ని గ్రామాలలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

## మహిళా సాధికారితతోనే అభివృద్ధి

**- ఎంపిడిఓ ఎం.ఉషారాణి**




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** మహిళలు సంపూర్ణ సాధికారిత సాధించినపుడే దేశాభివృద్ధి జరుగుతుందని పెద్దాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి మాదిరెడ్డి ఉషారాణి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పెద్దాపురం మండలంలోని కాంద్రకోట, ఉలిమేశ్వరం గ్రామాలలో జరిగిన గ్రామ సభలలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినపుడు 9శాతంగా ఉన్న మహిళా అక్షరాస్యత ప్రస్తుతం 77శాతంకు చేరుకుందని, ప్రస్తుతం భారతదేశంలో జిడిపిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచవలసిన అవసరం ఉందని, మహిళాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని ఆమె తెలిపారు. ఇఓ & పిఆర్‌డి కె.రాజశేఖర్ మాట్లాడుతూ సామాజిక రుగ్మత పోవాలంటే మహిళా చైతన్యం అవసరమని తెలిపారు. జడ్పిటిసి గవరసాన సూర్యచక్రరావు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి మహిళలకు ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా రాజకీయ పదవులు ఇచ్చారని, అక్కాచెల్లెమ్మలందరూ ఆయన చేసిన మేలును మరువకూడదని అన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ఉషారాణిని సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జోకా పద్మనాభం, పంచాయతీ సెక్రటరీ బషీరుద్దీన్‌లు శాలువాలతో సత్కరించారు. దీనిలో భాగంగా పెద్దాపురం మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో మహిళా గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల మహిళా సర్పంచ్‌లు, మహిళా ఎంపిటిసిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వైసిపి నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


## కిట్స్ మహిళా ఫార్మసి కళాశాలలో

**- మహిళా దినోత్సవ వేడుకలు**




**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండల పరిధిలో దివిలి గ్రామంలో ఉన్న కిట్స్ మహిళా ఫార్మసి కళాశాలలో శుక్రవారం ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డా.అమృత అయ్యపు మాట్లాడుతూ లింగ ఐక్యత ప్రొత్సాహం విద్యతో మహిళలు తమ రంగంలో స్థిరపడడంతో పాటు కుటుంబంలో మహిళల ఆరోగ్యం ముఖ్యమని, వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.గుడు పాటి మధు మాట్లాడుతూ సమాజంలో మరియు కుటుంబంలో మహిళా సాధికారిత ఎంతో ముఖ్యమని మహిళలు ధృడ నిబద్దతతో ఏదైనా సాధించగలరని, యువత కళాశాల విద్యతో భవిష్యత్‌లో అద్భుతమైన లక్ష్యాలను చేరుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు మహిళలందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రినిటి సూపర్ స్పెషలిటి హాస్పటల్ భాగస్వామి డా.కిశోర్, కళాశాల అధ్యాపకులు, కళాశాల ఏఓ పెదకాపు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ మోహనరావు సూచనల మేరకు వేదపండితులు మరిడమ్మ అమ్మవారిని బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది కె.వి.డి.ప్రసాద్, వరహాలు, క్రాంతివీర్, లోవ, శివ పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు





**ఏలేశ్వరం,మేజర్‌న్యూస్:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఏలేరు నది ఒడ్డు వద్ద ఉన్న శ్రీ రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము రెండు గంటల నుండి భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 6 గంటల నుండి దేవాలయానికి వెళ్లే మార్గం భక్తులతో రద్దీ అయిపోయింది. భక్తులు ఏలేరు నదిలో పుణ్య స్థానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. దర్శనం అనంతరం శ్రీ అనంతలక్ష్మి సమేత సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో భక్తులు దర్శనానికి బయలుదేరారు.

ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారులు కోడూరు మహేష్, ఎలమంచిలి శేఖర్ లు మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పడుతుంది అన్నారు. బాలాజీ చౌక్ సెంటర్ నుండి మార్కెట్, దేవాలయం వెళ్లే మార్గంలో వివిధ దుకాణాల కూడళ్ళ వద్ద అల్పాహారము, మజ్జిగ తదితర ప్రసాదాలను భక్తులకు స్వచ్ఛందంగా అందజేశారు.

## వెంకన్న సన్నిధిలో శ్రవణా నక్షత్ర మాస కల్యాణం ప్రారంభం



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం అన్నవరపాడు గ్రామంలో 16 నెంబర్ జాతీయ రహదారి ప్రక్కన వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం రోజున మాస కళ్యాణాలు ప్రారంభించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి మీసాల రాధాకృష్ణ తెలియజేశారు. ఈ మాస కళ్యాణ ఉత్సవాలు ప్రతినెల శ్రవణ నక్షత్రం రోజున జరుగుతాయని ఆయన తెలియజేశారు. మార్చి ఎనిమిదో తేదీ మహాశివరాత్రి కావడం శుక్రవారం కావడం శ్రవణా నక్షత్రం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడంతో పాటు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా కార్య నిర్వహణ అధికారి మీసాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో అన్ని వసతులు కల్పించారు.

## పూరి గుడిసె లేకుండా ఇళ్ల స్థలాలు, ఇల్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు**



**పెరవలి, మేజర్ న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గంలో పూరి గుడిసే లేకుండా అర్హులకు ఇళ్లు, పేదలకు ఇళ్లస్థలాలు అందించమే లక్ష్యంగా పరిపాలన అందిస్తున్నామని, పేద కుటుంబాలన్నీ ఆనందంగా కుటుంబం మొత్తం నవ్వుతూ ఉండాలన్నదే సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని నిడదవోలుశాసనసభ్యులు జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మార్చి ఎనిమిదో తేదీ శుక్రవారం ఉదయం పెరవలి దీపికా ఫంక్షన్ హాల్ నందు పెరవలి మండలం కానూరు,నడుపల్లి, ఉసులుమర్రు, అన్నవరప్పడు, మల్లేశ్వరం, పిట్టలవేమవరం, ఖండవల్లి గ్రామాలలో అర్హులైన 1056 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ భూహక్కు పత్రాలను నిడదవోలు శాసనసభ్యులు జి.శ్రీనివాస్ నాయుడు చేతుల మీదగా అర్హులైన లబ్బుదారులకు ఇళ్లస్థలాల పత్రాలు అందజేయడం జరిగింది. మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలోకాకరపర్రు,పెరవలి, కొత్తపల్లి అగ్రహారం, ముక్కామల, కాపవరం,తీపర్రు,అజ్జరం, వెంకటరాయపురం గ్రామాలలో అర్హులైన 913 మంది లబ్ధిదారులకు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ భూహక్కు పత్రాలను ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు చేతుల మీదుగా అందజేశారుఈ కార్యక్రమంలో వివిధ గ్రామ సర్పంచ్ లు, పెరవలి మండల ఎంపీపీ కార్చెర్ల సీతారాం ప్రసాద్, వైస్ ఎంపీపీ వెంద్ర శ్రీనివాస్,జడ్పీటీసీ కొమ్మిశెట్టి రామాంజని కిచ్చు, రాష్ట్ర డైరెక్టర్ దొడ్డిగర్ల స్వాతి,మండల వైసిపి అధ్యక్షులు వీరమల్ల సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్, మండల ఎస్సీ సెల్, మండల సచివాలయం ఇంచార్జ్, ఎంపీటీసీ లు, వివిధ గ్రామ ల సొసైటీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## గ్రేడ్1 ఇఓగా తలాటంకు పదొన్నతి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలంలోని కాంద్రకోట గ్రామంలో వేంచేసి యున్న శ్రీశ్రీ నూకాలమ్మ అమ్మ వారి దేవస్థాన కార్యనిర్వాహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న తలాటం వెంకట సూర్యనారాయణకు గ్రేడ్-1 ఇఓగా పదొన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వెంకట సూర్యనారాయణను దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ భాబునాయుడుతో పాటు పలువురు ఇఓలు అభినందించినవారిలో ఉన్నారు.

# శివనామస్మరణతో దద్దరిల్లిన శైవ క్షేత్రాలు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని శైవ క్షేత్రాలు శుక్రవారం తెల్లవారు ఘమునుండి భక్తులు తో కిటకిట లాడి ఓం నమఃశివాయ అనే పంచాక్షరీ నామంతో దద్దరిల్లాయి. మహాశివరాత్రి పార్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు శివాలయాలకు సమీపంలో ఉన్న వాగుల్లో పుణ్యస్నానమాచరించి మహాదేవుణ్ణి, అమ్మవారిని దర్శించుకుని నందీశ్వరుని వద్ద పూజలు నిర్వహించారు. రాజవొమ్మంగి శ్రీ శ్రీ శ్రీ రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో పురోహితులు కప్పగంతల కృష్ణ శాస్త్రి,స్థానిక కల్యాణవేంకటేశ్వర స్వామి సన్నిధిలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పురోహితులు రవితేజ, జడ్డంగి శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి ఆలయంలోపురోహితులు అంజిబాబు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదలు అందజేశారు. కుంతీదేవి వాక,అమ్మిరేకుల షీకుదారా, వాతంగి, లబ్బర్తి, తాళ్లపాలెం గ్రామాలలో భక్తులు వాగుల్లో పుణ్య స్నానమాచరించి మహాదేవుణ్ణి దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. సింగిరెడ్డి రామకృష్ణ, గోమువెంకటలక్ష్మి, కొంగరమురళీకృష్ణ, ఘనజాల తాతారావు,సింగిరెడ్డి రవి, గొల్లపూడి పెద్దిరాజు, ఎన్. కుశరాజు తదితరులు కార్యాక్రమాన్ని పర్యవేక్షించారు.

## రోడ్ షోని విజయవంతం చేసిన వారందరికీ ధన్యవాదాలు

**- వై.సి.పి.మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు**



**వి.ఆర్.పురం,మేజర్‌న్యూస్ :** వై.ఎస్.ఆర్,వాహన యాత్ర భారీ ర్యాలీకి అశేష తరలివచ్చిన, వై.ఎస్.ఆర్.పార్టీ అభిమానులకు, ప్రజలకు, కార్యకర్తలకు, వై.సి.పి.మండల అధ్యక్షులు మాదిరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయంలో, సీనియర్ నాయకుడు, మాచర్ల గంగయ్య అధ్యక్షతన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వై.సి.పి.పార్టీ మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ,ఎమ్మెల్సీ ఆనంతబాబు,ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి రోడ్ షో కి వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేసిన మండల కమిటీ సభ్యులకు నాయకులకు 11 పంచాయతీలు అనగా వడ్డిగూడెం, రేఖపల్లి, రాజుపేట, శ్రీరామగిరి, జీడిగుప్ప, తుమ్మిలేరు, పెద్దమట్టపల్లి, చిన్నమట్టపల్లి, రామవరం, కుందులూరు, ములకనపల్లి గ్రామపంచాయతీ కార్యకర్తలకు, గృహాసారధులకు, వై.సి.పి.పార్టీ మండల కమిటీ, సభ్యులకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. అన్నీ పంచాయతీల కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్‌లు కలసికట్టుగా పనిచేసి ఈ యొక్క రోడ్ షోకి పెద్ద ఎత్తున జనం వచ్చేలా కృషి చేశారని వారందకి మండల కమిటీ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండల జె.సి.ఎస్. కన్వీనర్ బొడ్డు సత్యనారాయణ, మాట్లాడుతూ వై.సి.పి.పార్టీకి తిరుగులేని ఆదరణ ఉందని నిరూపించారని ఆయన అన్నారు.ఎస్.టి.ఎస్.సి.కమీషన్ సబ్యులు చిక్కాల బాలకృష్ణ(బాలు)మాట్లాడుతూ అద్భుతమైన ఆదరణ చూపి,రాత్రి10 గంటల వరకు చెక్కు చెదరని అభిమానంతో ర్యాలీలో పాల్గొన్న వారందరికీ పేరు, పేరున, కృతజ్ఞతలు తెలియజేశారు. అలానే పార్టీ పిలుపునిచ్చే ప్రతీ కార్యక్రమానికి, కార్యకర్తలు అందరూ ఇలానే కదలి రావాలని వారన్నారు.రానున్న ఎన్నికలలో మనమంతా కలసి కష్టపడి పనిచేసి మళ్ళీ జగన్మోహన్ రెడ్డి గారిని ముఖ్యమంత్రి నిచేయాలని కోరారు. ఈసమావేశంలోమండల కమిటీ నాయకులు మామిడి రాజు,మామిడి.బాలాజీ,మొడెం నరేష్, డైనమిక్ యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# భక్తిభావం..సేవాభావం..

**వి.ఆర్.పురం,మేజర్‌న్యూస్:** భక్తి భావం, సేవాగుణం, శివాలయం, రామాలయం,వెంకటేశ్వర స్వామి ఆలయం,ఎక్కడైనా ఎప్పుడైనా,ముత్యాల రామారావు, ఉండాల్సిందే!వయస్సురీత్యా సహకరించకపోయినా!దుర్గమ్మ, మైసమ్మ,ముత్యాలమ్మ, ఆలయ సందర్శనీయాలు ఆయన ప్రత్యేకత. అందరినీ పూజిస్తారు.భక్తిభావం మూర్తీభవించిన,ఆయన తన హావ భావాలతో,కంచుకంఠంతో,అద్భుతమైన శ్లోకాలను ఆలపించేవారు. భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా! మెడికల్ క్యాంపులు,డ్రికింగ్ వాటర్,చలువ పందిళ్లు,మజ్జిక పాకెట్స్,ఉచిత ప్రసాదం కౌంటర్లు,మండపాల్లో ఏర్పాటు చేయించేవారు,దేవాలయాలకు వచ్చే భక్తులకు అన్నీతానై సూచుకోవడం,ఆయన సొంతం.ఆయన గాత్రంతో దేవాలయంలో కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు.భక్తులను పలకరించడంలో,ఆయనస్టైల్‌అద్భుతంగా!ప్రదర్శిస్తుఉంటారు. పూజాకార్యక్రమాలు జరుగే సందర్భాల్లో మైక్ లో మాట్లాడుతూ అందరినీ ఎంతగానో ఆకట్టుకునేలా మాట్లాడేవారు.ఎక్కడ భక్తిభావంతో కార్యక్రమాలు నిర్వహించినా, భక్తులను ఆయన కంచుకంఠం గాత్రంతో అద్భుతమైన పాటలను పాడుతూ మంత్రముగ్ధులను చేసేవారు.2001 ఆటైంలో వడ్డిగూడెం, రుద్రకోటేశ్వర స్వామి,ఆలయంలోఅద్భుతమైన "నాటక"ప్రదర్శనలుప్రదర్శించేవారు. భక్తి గీతాలు ఆలపించేవారు,వడ్డిగూడెం గ్రామంలో స్టేజీ ఆర్టిస్టులు,చాలా మందిఉన్నారు.ఎంతో వైభవంగా రుద్రకోటేశ్వర స్వామి వారి కళ్యాణం వేడుకలు ముత్యాల రామారావు,దగ్గరుండి అన్నీతానై చూస్తూఉండేవారు.గాయకుడిగా గ్రామపెద్దగా,జడ్పీ.టి.సి.గాఈమండలానికి ఎంతో సేవ చేశారు.సినిమాలు,నాటకాలు, నాటికలు, ప్రదర్శించే వారు.పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ఇప్పటికీ మొక్కువోని,దీక్షతో దేవాలయంలో పూజలు నిర్వహించి గత వైభవాన్ని మళ్లీ చూడాలనేతపన ముఖంలో కనిపిస్తుంది.పాత కాలంనాటి ఘంటసాల,గీతాలు ఆలపించేవారు.ఆయన అప్పుడు, ఇప్పుడు,మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆయన సహాకారం,సూచనలు ఎప్పుడూ ఉంటాయి ఆయనే మన మాజీ జడ్పీ.టి.సి.ముత్యాల రామారావు,ఎక్కడవేడుకలు జరిగినా!పూజాకార్యక్రమాలు నిర్వహించినా!ఆయన ఉండాల్సిందే.

## మహాశివరాత్రి సందర్భంగా అన్నవరప్పాడులో స్పటిక లింగ దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెరవలి, మేజర్ న్యూస్ : పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామంలో 16 నెంబర్ జాతీయ రహదారి ప్రక్కన వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో కొలువైన శ్రీ ఉమా విశ్వేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధిలోని అంబికా సమేత స్పటిక లింగ రూప మహామహేశ్వర స్వామి వారి కోనేటి ఆలయ దర్శనానికి మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మార్చి 8వ తేదీ శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం జాతీయ రహదారి కిక్కిరిసింది. మహాశివరాత్రి సందర్భంగా స్వామివారి స్పటిక లింగ దర్శనానికి భక్తులను అనుమతించినట్లు అన్నవరప్పాడు స్పటిక లింగ క్షేత్ర నిర్మాణకర్త బొలిశెట్టి రామకృష్ణ మేజర్ న్యూస్ కు తెలియజేశారు. శుక్రవారం మహాశివరాత్రి రోజు మార్చి 9వ తేదీ శనివారం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని ఆరోజు కూడా స్పటిక లింగాన్ని దర్శించుకునేందుకు వీలు కల్పించామని ఈ రెండు రోజులపాటు అందుకు తగిన ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ రెండు రోజులు దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని భక్తులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఏడాదికి కేవలం మహాశివరాత్రి సందర్భంగా రెండు రోజులు కార్తీక పౌర్ణమి సందర్భంగా రెండు రోజులు వార్షికోత్సవం సందర్భంగా రెండు రోజులు ఇలా మూడు పర్యాయాలు మాత్రమే స్పటిక లింగ దర్శనం కలుగుతుందన్నారు. మిగిలిన రోజులు స్వామివారు కోనేటి లోనే ఉంటారన్నారు మహామహేశ్వరుని తో పాటు ఆ పైన ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలను కూడా భక్తులు దర్శించుకోవాలని ఆయన కోరారు. ఈ ఆలయం జాతీయ రహదారి పక్కనే ఉండటంతో భారీ సంఖ్యలో వచ్చిన భక్తులను అదుపు చేయడానికి ఆలయ సిబ్బందితో పాటు పెరవలి ఎస్సై ఏజి ఎస్ మూర్తి ఆధ్వర్యంలో పెరవలి పోలీస్ వారు బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులను క్రమబద్ధీకరించి భక్తులకు స్వామివారి దర్శనాన్ని సులభతరం చేశారు.